
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
బుధవారం 1 అక్టోబరు 2025





హోర్డింగులను తొలగిస్తున్న సిబ్బంది

రాజకీయ పార్టీల హోర్డింగుల తొలగింపు

ఉట్నూర్,సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నియమావళి అమలుల్లోకొచ్చింది. మంగళవారం అంబేద్కర్ చౌక్, ఎన్టీఆర్ చౌక్, వినాయక్ చౌక్ ప్రాంతాల్లో ఉన్న రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను పంచాయతీ ఈఓ శంకర్, ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు ఉట్నూర్ గ్రామ పంచాయతీ అధికారులు తొలగించారు.



పోలింగ్ బూత్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

జీడిపల్లి పోలింగ్ బూత్‌ను పరిశీలించిన ఎంపీడీవో

బోథ్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు అధికార యంత్రం సమాయత్తమవుతోంది. అందులో భాగంగానే మంగళవారం ఎంపీడీవో రమేష్ ఎంపీఈఓ అతుల్ కుమార్‌లతో కలిసి జీడిపల్లిలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల వరకు పోలింగ్ కేంద్రాలు వసతులు కల్పించాలని సూచించారు.

ఆదివాసీల హక్కుల కోసం ఐక్యంగా పోరాడుదాం

» రాష్ట్ర అధ్యక్షులు కొడప సోనేరావు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీల అభివృద్ధికి, హక్కుల కోసం ఐక్యంగా ఉండి పోరాడతామని కోలాం సేవ సంఘం నూతన రాష్ట్రఅధ్యక్షుడు కొడప సోనేరావు అన్నారు. మంగళవారం స్థానిక ఆర్ఎస్ గార్డెన్స్‌లో సంఘం రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శిగా సిడాం రాజు, ఉపాధ్యక్షులుగా మడావి లచ్చు, గౌరవ అధ్యక్షులుగా టేకం లక్ష్మణ్‌ను ఎన్నుకున్న అనంతరం వారికి నేతలు అభినందనలు తెలిపారు. ఆదివాసీల అభ్యున్నతికి తమవంతుగా కృషి చేస్తామని, తమపై నమ్మకం ఉంచిన ప్రతి ఒక్కరికి నూతన అధ్యక్షుడు కొడప సోనేరావు ధన్యవాదాలు తెలిపారు.

సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్థానిక డైట్ మైదానంలో అక్టోబరు 1న పెద్ద ఎత్తున బతుకమ్మ సంబరాలను నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ ఖత్రి తెలిపారు. స్థానిక డైట్ మైదానంలో ఏర్పాటుచేసిన సమావేశంలో బతుకమ్మ వేడుకల వివరాలను ఆయన వెల్లడించారు. కాలనీల వారీగా మహిళలు ఒక బతుకమ్మను అందంగా తయారు చేసి తీసుకురావాలని, బతుకమ్మ గీతాలపై ప్రదర్శనలు ఇచ్చిన వారికి బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శులు గెడం మాధవ్, సూర్యకాంత్ పడకంటి, కందుల రవీందర్, నర్సీజి, మహిపాల్, శశికళ, కృష్ణ పాల్గొన్నారు.

బయోకెమిస్ట్‌లకు సత్కారం

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల బయోకెమిస్ట్‌లుగా ఉద్యోగోన్నతి పొందిన వారిని డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, డీఐఓ డాక్టర్ వైసీ శ్రీనివాస్, డీఎంఓ ఎం.శ్రీధర్ మంగళవారం ఘనంగా సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. 26 ఏళ్లుగా ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2గా వివిధ పీహెచ్‌సీలలో సేవలందించి బయోకెమిస్ట్ గజిటెడ్ హోదాలో ఉద్యోగోన్నతి పొందిన బండారికృష్ణ, ఎనుగుర్తి రమణాచారి, ఎం.ఏ సమీలకు అభినందలు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రఘురాం, కార్యాలయ పర్యవేక్షకులు గోపి, బ్రహ్మానందరెడ్డి, మధుసుధన్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల షెడ్యులు విడుదల కావడంతో పల్లె రాజకీయాలు మరింత హిటెక్కుతున్నాయి. మొదట పరిషత్ ఎన్నికలు, ఆ తర్వాత పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తుంది. ఎలాగైనా గెలిచేందుకు ఆశావాహులు వివిధ రకాల ప్రయత్నాలు మొదలు పెట్టారు. గెలిచే అవకాశం లేని చోట ఏకగ్రీవ అంశాన్ని తెరపైకి తెస్తున్నారు. గ్రామ అభివృద్ధి పేరిటా వీడీసీలు ఏకగ్రీవం దిశగా అడుగులు వేస్తున్నాయి.



ఏకగ్రీవ 'పంచాయతీ'

» రంగంలోకి గ్రామ వీడీసీ కమిటీలు
» రిజర్వేషన్ పంచాయతీలపై నేతల దృష్టి
» గ్రామస్థుల ఏకాభిప్రాయం కోసం మంతనాలు
» ఎన్నికలకు ముందే ఏకగ్రీవం వైపు పలు పంచాయతీలు
» దసరా తర్వాత ఊపందుకోనున్న పల్లె రాజకీయాలు

ఆదిలాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సామాజిక వర్గాల వారీగా పంచాయతీ ఎన్నికలపై ఆసక్తి చూపుతున్న ఆశావహులందరినీ ఏకతాటి పైకి తెచ్చేందుకు మంతనాలు జరుగుతున్నాయి. గత ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 162 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఈసారి కూడా మెజార్టీ గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం చేసేందుకు గ్రామపెద్దలు ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. 266 గ్రామపంచాయతీలు ఏజెన్సీ పంచాయతీలే కావడంతో ఏకగ్రీవమయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రజాసమస్యలు, సమాజం పట్ల అవగాహన కలిగినఅభ్యర్థులను సర్పంచ్‌గా ఎన్నుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎన్నికలు నిర్వహిస్తే ఆర్థికంగా నష్టపోవడంతో పాటుగ్రామాల్లో మనస్పార్థాలు, వర్గ విబేదాలు, ఘర్షణలు, వివాదాలు తలెత్తే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఎన్నికల బరిలో నిలిచే వారంతా సర్పంచ్, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు అయ్యేందుకు తహతహలాడుతున్నారు.

రూ.10లక్షల నజరానా కోసం..

ఏకగ్రీవమైతే ప్రభుత్వం అందించే నజరానాతో గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 5వేల జనాభాకుపైగా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.15 లక్షలు, ఆలోపు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.10లక్షల నిధులను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. అయితే గతంలో ఏకగ్రీవమైన పంచాయతీలకు ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం నజరానా అందించక పోవడంతో పలు గ్రామాల ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అయితే పోటీ అధికంగా కనిపిస్తున్న చోట టెండర్, లాటరీ పద్ధతిల్లో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డుసభ్యుల ఎంపికకు ప్రయత్నాలు మొదలయ్యాయి. గ్రామ వీడీసీ నిర్ణయాన్ని కాదని ఎవరైనా ఎన్నికల్లో పోటీచేస్తే ఇబ్బందులు తప్పవన్న హెచ్చరికలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం గ్రామాల్లో ఏ నలుగురు కలిసినా పంచాయతీ ఎన్నికల పైననే చర్చించుకోవడం ప్రధానంగా కనిపిస్తుంది. కొన్ని గ్రామాల్లో వీడీసీ నిర్ణయాలను వ్యతిరేకిస్తే చిన్నపాటి మనస్పార్థాలు ఘర్షణలకు దారి తీసే అవకాశం ఉందంటున్నారు.

రిజర్వేషన్ పంచాయతీల మొగ్గు

ఏకగ్రీవం వైపు రిజర్వేషన్ పంచాయతీలు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కలిగిన గ్రామ పంచాయతీలు ఎన్నికలకు వెళ్లేందుకు ఆసక్తి చూపినట్లు కనిపించడం లేదు. ఎందుకంటే పోటీ తత్వంతో ఖర్చుభారం పెరిగే అవకాశం ఉందంటున్నారు. దీంతో ఎలాంటి ప్రయోజనం ఉండదని భావిస్తున్నారు. రిజర్వేషన్ గ్రామ పంచాయతీలపై నేతలు ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. జిల్లా ఏజెన్సీ మారుమూల ప్రాంతాల్లో ఎక్కువ గ్రామ పంచాయతీలు, గిరిజన తండాలు, గూడెలే కావడంతో స్థానికంగా మంచి పలుకుబడి ఉన్న నేతలే పంచాయతీ ఎన్నికల్లో చక్రం తిప్పేందుకు ప్రయత్నిస్తున్నారు. మెజార్టీ గ్రామ పంచాయతీలను తమ ఖాతాలో వేసుకునేందుకు ప్రధానపార్టీల నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామాల వారీగా పోటీకి ఆసక్తి చూపుతున్న ఆశావాహులతో మంతనాలు జరుపుతున్నారు. కుదిరితే ఏకగ్రీవం (మిగతా 6వ పేజీలో)

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

నార్నూర్, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): గుడుంబా తయారు చేసి విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఉట్నూర్ ఎక్సైజ్ సీఐ రూప్‌సింగ్ అన్నారు. మండలంలోని తాడిహత్నూర్, నగల్‌కొండ నార్నూర్ గ్రామాల మంగళవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. భీంపూర్ గ్రామంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించాగా ఆరు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసి ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నవరాత్రులు, దసరా సందర్భంగా ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు గంజాయి కేసులో మూడేళ్ల జైలు రూ.10వేల జరిమానా ఉంటుందని చెప్పారు. ఈ దాడిలో హెడ్‌కానిస్టేబుల్ లింగన్న, ఆశన్న శ్రవణ్‌కుమార్, స్రవంతి, గంగాధర్ ఉన్నారు.

భక్తుల పాదయాత్ర

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ రామచంద్ర గోపాల కృష్ణ మఠం నుంచి గ్రీన్ వ్యాలీలోని త్రిశక్తి మాత మందిరం వరకు భక్తులు పాదయాత్ర చేపట్టారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం మఠంలో ప్రత్యేక పూజలుచేశారు. అనంతరం మఠాధిపతి యోగానంద సరస్వతి ఈ పాదయాత్రను ప్రారంభించారు. భక్తులు కాషాయ ధ్వజాలను చేతపట్టుకుని జై మాతాది నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో రమేష్ శర్మ, బెజ్జంకి సంజీవ్ పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న భక్తులు



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

విజయదశమి ఉత్సవాల ఏర్పాట్లకు భూమిపూజ

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అనాదిగా వస్తున్న దసరా ఉత్సవాలను ఈ ఏడాది సైతం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. హిందూ సమాజ్ ఉత్సవ్ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని దసరా మైదానంలో నిర్వహించనున్న విజయదశమి ఉత్సవాలకు సంబంధించిన పనులకు ఆయన భూమిపూజ చేశారు. మఠాధిపతి యోగానంద సరస్వతితో కలిసి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. చెడుపై విజయం సాధించినందుకు జరుపుకునే గొప్ప పండుగ దసరా అని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సనాతన హిందూ ధర్మం విశిష్టతను ప్రపంచమంతా గుర్తిస్తోందని పేర్కొన్నారు. దసరా రోజున కన్యక పరమేశ్వరి దేవి ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమై మైదానం వరకు కొనసాగుతుందని, ఉత్సవాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవసమితి అధ్యక్షుడు హన్మాండ్లు, రాళ్లబండి మహేందర్, చిల్కూరి జ్యోతి రెడ్డి, సచిన్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా బతుకమ్మ వేడుకలు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ వేడుకలను అధికారికంగా వేడుకలు నిర్వహిస్తున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఉత్సవాలు జరిపారు. డీఆర్‌డీఏ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బతుకమ్మ సంబరాలకు కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా బతుకమ్మ వద్ద పూజలు చేసిన అనంతరం కోలాటాలు ఆడారు. మహిళా ఉద్యోగినులు పెద్ద సంఖ్యలో హాజరై బతుకమ్మ పాటలకు తగ్గట్లుగా నృత్యాలు చేయడంతో కోలాహల వాతావరణం నెలకొంది.



బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు



బతుకమ్మకు పూజలు చేస్తున్న కలెక్టర్



కోలాటాలు ఆడుతున్న కలెక్టర్

జిల్లా వాసీకి బెస్ట్ క్రైసిస్ కమ్యూనికేషన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న చవాన్‌రాణా ఆశీష్

ఆదిలాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గోవాలో జరిగిన 15వ పీఆర్‌సీఐ ఎక్సలెన్స్ అవార్డు అండ్ 19వ గ్లోబల్ కమ్యూనికేషన్ కాన్‌క్లేవ్‌లో ఇండియన్ ఆయిల్ ప్రతిభ చాటింది. 100కు పైగా ప్రముఖ సంస్థల పోటీని తట్టుకుని 50 విభిన్న కేటగిరిల్లో 48 అవార్డులు అందుకోవడం సంస్థ ప్రతిభకు శక్తికి ప్రతికగా నిలిచింది. ఇందులో 11 గోల్డ్, 9 సిల్వర్, 13 బ్రాంజ్, 15 కన్సోలేషన్ అవార్డులు ఉన్నాయని తెలిపారు. ఈ అవార్డుల్లో ప్రత్యేకమైన బెస్ట్ క్రైసిస్ కమ్యూనికేషన్ విభాగంలో వ్యక్తిగత గౌరవాన్ని అందుకోవడం సంతోషంగా ఉందని జిల్లాకు చెందిన కార్పొరేట్ కమ్యూనికేషన్స్ అధికారి చవాన్‌రాణా ఆశీష్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో కీలకంగా వ్యవహరించి అత్యవసర పరిస్థితుల్లో సోషల్ మీడియాలో సమర్థవంతమైన సమాచార సమన్వయాన్ని చవాన్‌రాణానిర్వహించారు. ఆయన ట్వీట్ కోఆర్డినేషన్ దేశవ్యాప్తంగా ఎంతో ఆధరణ పొందింది. భద్రత సిబ్బందికి మద్దతు తెలిపి సంస్థ గొప్పదనాన్ని ప్రతిబింబించిందన్నారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

» కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు, పార్టీల నేతలు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఆల్ పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేయగా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనల గురించి ఆయా పార్టీల నాయకులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జిల్లాలో రెండు విడతల్లో జరగనున్నాయని తెలిపారు. పార్టీల నేతలు ఎన్నికల నియమ నిబంధనలను పాటించాలని సూచించారు. ప్రచారం కోసం జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులు ఆర్డీఓ లేదా సబ్‌కలెక్టర్ నుంచి, గ్రామ పంచాయతీకి అయితే తహసీల్దార్ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే పనులు చేయొద్దని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేలా సహకరించాలని కోరారు. అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని, ఎన్నికల నిబంధనల మేరకు ప్రజలు 50వేలకు పైగా నగదు తీసుకెళ్లవద్దని చెప్పారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తే దానికి సంబంధించి ఆధారాలు వెంట ఉంచుకోవాలన్నారు. ర్యాలీలు, మైక్ సెట్ కోసం 14గంటల ముందు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, స్థానికసంస్థల అదనపుకలెక్టర్ రాజేశ్వర్, అసిస్టెంట్ శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, ఆర్డీఓ స్రవంతి, ఆయా శాఖల అధికారులు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

ఆదిలాబాద్‌టౌన్: గ్రూప్-1 పరీక్షల్లో ఎంపీడీవో ఉద్యోగం సాధించిన తుడుం లవకుమార్, పాటిల్ జ్యోతిలను కలెక్టర్ రాజర్షిషా అభినందించారు. ఉట్నూర్ మండలం కొత్తగూడకు చెందిన తుడుం లవకుమార్, బజార్‌హత్నూర్ మండలం గిన్నూర్‌కు చెందిన పాటిల్ జ్యోత్స్న గ్రూప్-1 పరీక్షలో ఎంపీడీవోగా ఎంపికయ్యారు. మంగళవారం వారు కలెక్టర్ రాజర్షి షాను మర్యాదపూర్వకంగా కలవగా... వారిని శాలువాతో సన్మానించారు. రాష్ట్ర సేవలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. వీరి విజయాలు యువతకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపురావు క్యాంప్ కార్యాలయంలో బీఎస్పీ నుంచి బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన మెస్రం జగు బాపు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోయంతో పాటు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడె గజేందర్ సమక్షంలో ఆయన పార్టీలో చేరగా కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. కాంగ్రెస్ పార్టీతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, నేతలు తుల అరుణ్, కొమురంకోటేష్, జాలికే పాండురంగ, లింగారెడ్డి ఉన్నారు.



కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నేతలు

ఎన్నికైన నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

నిర్మల్‌రూరల్,సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి):పట్టణంలో గల చిత్రకారులు అం దరూ సమావేశమై పట్టణ ఆర్టిస్ట్ యూనియన్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మా ట్లాడుతూ... ఇన్ని సంవత్సరాల తర్వాత ఎన్నికలు జరపడం చాలా మంచి పరిమాణమని వ్యాఖ్యానించారు. అందరూ కలిసికట్టుగా ఉండి అన్ని ప్రభుత్వ పను లు అందరూ పంచుకోవాలని, మన అభివృద్ధితోపాటు సంఘ అభివృద్ధికి పాటు పడాలని, ఇందులో ఎలాంటి విభేదాలకు తావివ్వకుండా మనం ఐకమత్యంగా ఉండాలని అధ్యక్షులు రవి వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి హాజరైన డాక్టర్ కృష్ణంరాజు, డాక్టర్ వేణుగోపాల్ కార్యవర్గ సభ్యులను అభినందించి శాలువాలతో సత్కరించారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

అధ్యక్షుడిగారవితిరుక్కోవెల, ఉపాధ్యక్షుడిగా రాజేష్,ముబీన్, ప్రధాన కార్యదర్శి ధనాలకోట కృష్ణ వర్మ, కోశాధికారి చందుపట్ల వెంకట రమణ, సంయుక్త కార్యదర్శి ద్వారా శెట్టి సాయి, ప్రచార కార్యదర్శి తోకల రాజేశ్వర్, మిగతా కళాకారులందరూ పాల్గొన్నారు.

ఆ ఊర్లలో ఒక్కరంటే ఒక్క బీసీ ఓటరు లేరు



సల్యాద గ్రామపంచాయతీలోని ప్రభుత్వ పాఠశాల

ఇచ్చోడ, సెప్టెంబరు, 30 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చోడ మండలంలోని సల్యాద గ్రామపంచాయితీలో అంతా గిరిజనులే. ఇక్కడ సర్పంచ్ పదవి బీసీ జనరల్‌కు రిజర్వు చేశారు. ఈ పంచాయతీకి చిన్న సల్యాద, జగనపూర్ గ్రామాలు సైతం ఇదే పంచాయితీలోకి వస్తాయి. ఆ ఊర్లలో కూడా బీసీలు లేరు. ఈ విషయమై గ్రామస్థులంతా కలిసి జిల్లా పాలనాధికారికి తమ గోడును వెల్లబుచ్చుకున్నారు. ఒక్కరంటే ఒక్కరు కూడా బీసీ ఓటరు లేని మా గ్రామపంచాయితీలో ఎన్నికలు ఏలా నిర్వహిస్తారని వివరించారు. రిజర్వేషన్లు ఎస్టీ మహిళ వస్తుందా.. జనరల్ వస్తుందా.. అని అనుకున్నారు.. అక్కడి ప్రజలు. కానీ అక్కడ రిజర్వేషన్ బీసీ రావడంపై అవాక్కయ్యారు.

హెడ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయాలి

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి సాయి చరణ్‌పై విచక్షణ రహితంగా దాడికి పాల్పడిన హెడ్ కానిస్టేబుల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని యాదవ సంఘం రాష్ట్ర నాయకులు నారాయణ యాదవ్, జిల్లా అధ్యక్షులు అసుర హన్మండ్లు యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా యాదవ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సాయి చరణ్ అనే విద్యార్థి నేతాజీ చౌక్ నుంచి వినాయక్ చౌక్ మోటార్ బైక్‌పై వస్తున్న సమయంలో అనుకోకుండా ఆగిపోయిందని, గమనించిన హెడ్ కానిస్టేబుల్ సదరువిద్యార్థిని బెదరించి కాలర్ పట్టుకొని ఈడ్చుకెళ్లాడని అన్నారు. సాయి కిరణ్ ఎంత బతిమాలిన వదలకుండా దాడి చేశారని, వదలకుండా స్టేషన్‌కు తీసుకెళ్లి లాఠీతో కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారన్నారు. విద్యార్థిపై అమానుషంగా దాడికి పాల్పడ్డ హెడ్ కానిస్టేబుల్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, 3ఏ విషయమై జిల్లా ఎస్పీకి సైతం ఫిర్యాదు చేశామన్నారు. ఘటనపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని ఎస్పీహామీ ఇచ్చారన్నారు. జిల్లా ఎస్పీ వచ్చాక పోలీసు వ్యవస్థపై నమ్మకం పెరిగిందని, నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి సాయికిరణ్‌కు న్యాయం చేయాలన్నారు. లేని పక్షంలో నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడతామని తెలిపారు.ఈకార్యక్రమంలో జిల్లాయాదవ సంఘం నాయకులు సెవ్వజగదీష్ యాదవ్, రమేష్ యాదవ్ పాల్గొన్నారు

కాంగ్రెస్‌లో చేరిన సోనాల గ్రామ కమిటీ అధ్యక్షుడు



బీఆర్‌ఎస్ నేతను కాంగ్రెస్ పార్టీలోకి స్వాగతిస్తున్న ఏఐసీసీ విచార్ విభాగ్ రాష్ట్ర కోఆర్డినేటర్

బోథ్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సోనాల మండలం కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మునేశ్వర సోమన్న మంగళవారం బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనను ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర విచార్ విభాగ్ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు మాట్లాడుతూ పార్టీలో తనకు సరైన గుర్తింపు లేదని అంతేగాక పార్టీ నాయకులు ఎవరు పట్టించుకోకపోవడం వల్ల తాను నిరాశకు గురై పార్టీ పెడుతున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాజుల పోతన్న, సహకార సంఘం డైరెక్టర్ పోశెట్టి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బత్తుల రమేష్, పట్టణ అధ్యక్షులు చెట్ల పెల్లి అనిల్‌తో పాటు మాజీ సర్పంచ్ నరోత్తం రెడ్డి, సోయం బాపూరావు, షైముద్, శ్రీనివాస్, రామాయి రాము తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ఎప్పుడు..?

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చించుఘాట్ గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజన మహిళలు తమకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని కోరుతున్నారు. కూలీనాలీ చేసుకుని జీవించే నిరుపేదలమని, గుడిసెల్లో ఉంటున్నామని, పక్కా ఇళ్లు లేవని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదని, న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఎస్సారెస్పీలోకి 3.35 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

39 వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల

మెండోర, సెప్టెంబరు, 30(ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 3 లక్షల 35వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండలంతో ప్రాజెక్టు అధికారులు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లు ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టులోకి ఉదయం 3 లక్షల 90 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చినప్పటికీ సాయంత్రానికి స్వల్పంగా వరద తగ్గింది.

హిందువుల ఐక్యతకు పంచ పరివర్తన్



సమావేశంలో మాట్లాడుతున్న సద్గురు మహాదేవ స్వామి

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : హిందువుల ఐక్యతకు పంచ పరివర్తన్ ద్వారా ఆర్ఎస్ఎస్ కృషి చేస్తుందని ఆర్ఎస్ఎస్ ఇందూర్ విభాగ్ కార్యవాహ రాజులవార్ దిగంబర్ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాలలో భాగంగా ఆర్ఎస్ఎస్ మంజులాపూర్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక మున్నూరు కాపు సంఘంలో విజయదశమి ఉత్సవం జరిగింది. కార్యక్రమంలో ప్రధాన వక్త రాజులవార్ దిగంబర్ (ఇందూర్ విభాగ్ కార్యవాహ) ప్రసంగించారు. 1925లో ప్రారంభమై నేడు దేశ వ్యాప్తంగా విస్తృత శాఖలతో, విభిన్న రంగాల్లో దేశభక్తి పూరిత, హిందుత్వ ఆధార సంస్థలతో ప్రపంచంలోని అనేక దేశాలలో పని చేస్తుందని చెప్పారు. హిందువులలో ఐక్యతను శాఖ ఆధారంగా సంఘము పెంపొందిస్తుందని పేర్కొన్నారు. హిందుత్వం జీవన విధానం, విశ్వశాంతికి ఆధారం, ప్రపంచంలోని వివిధ మతాలను సమన్వయపరిచే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయని వివరించారు. దేశ అభివృద్ధి కొరకు హిందువులు పంచ పరివర్తన్ కోసం పాటుపడాలని సూచించారు. సామాజిక సమరసత, కుటుంబ జీవన విలువలు, స్వ ఆధారిత జీవనం, పర్యావరణ పరిరక్షణ, పౌర విధులు ప్రతి ఒక్కరి కుటుంబంలో పాటించబడాలన్నారు. ఆర్ఎస్ఎస్ జన్మ శతాబ్దిలో భాగంగా రాబోయే రోజుల్లో ఇంటింటి జన జాగరణ చేపట్టబోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి శ్రీశ్రీశ్రీ సద్గురు మహాదేవ స్వామి (మహాదేవ ధర్మపీఠం, గుడిమెట్, కామారెడ్డి) మాట్లాడుతూ... ఆర్ఎస్ఎస్ ఈ దేశ అఖండతకు, వ్యక్తి నిర్మాణానికి, హిందుత్వ పరిరక్షణకు చేపడుతున్న చర్యలు అందరూ స్వాగతించాలని కోరారు. దేశ వ్యాప్తంగా చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆర్ఎస్ఎస్‌ను ప్రజలకు చేరువ చేసిందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహ కార్యవాహ మంచిర్యాల నాగభూషణం, కిన్నెర్ల రవి, నార్లపురం రవీందర్, వల్లెపు శివ, నారి విక్రమ్, అయిండ్ల సాత్విక్, తాండ్ర సుశాంత్, చిన్నయ్య, సుదర్శన్ చారి, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల ఆరాధ్య దైవం భీమన్న ఆలయం ఆక్రమణ యత్నం

గిరిజనేతరులపై చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ హెచ్చరిక



మాట్లాడుతున్న తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్

నిర్మల్ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా, మామడ మండలం, పోతారం గ్రామంలో ఆదివాసి నాయక్‌పోడ్ తెగకు చెందిన ఆరాధ్య దైవం భీమన్న ఆలయాన్ని గిరిజనేతరులు దౌర్జన్యంగా ఆక్రమించుకోవడానికి ప్రయత్నించడం, ఆదివాసీలపై దాడి చేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ముత్తాతల కాలం నుంచి నాయక్‌పోడ్ తెగకు చెందిన ఆదివాసీలు పూజలు నిర్వహిస్తున్న తమ కుల దేవత భీమన్న ఆలయాన్ని గుంజుకోవడం తమ సంస్కృతి, సంప్రదాయాలను ధ్వంసం చేయడమే అవుతుందని తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ దౌర్జన్యంపై తక్షణమే స్పందించి, చట్టపరమైన చర్యలు చేపట్టాలని గోడం గణేష్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడం జరిగింది. తక్షణ చర్యలు లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన ఫిర్యాదు చేసినప్పటికీ జిల్లా ఎస్పీతో పాటు ఎస్సై, కలెక్టర్లకు విన్నవించినా అధికారులు ఇప్పటి వరకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించి కనీసం చర్యలు తీసుకోలేదని తుడుందెబ్బ రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ ఆగ్రహంవ్యక్తం చేశారు. తక్షణమే గిరిజనేతరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద క్రిమినల్ చర్యలు తీసుకొని, వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశా రు. జిల్లా వ్యాప్తంగా తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆం దోళన చేపడతామని హెచ్చరించారు. అంతే కాకుండా వారం రోజుల్లో జిల్లా కలెక్టరేట్ ముట్ట డికి కార్యక్రమం కూడా ఏర్పాటు చేస్తా మని తెలిపారు.ఈకార్యక్రమంలో తుడుందెబ్బరాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకగారి భూమయ్య, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడుసాకిలక్ష్మణ్,వర్కింగ్ ప్రెసిడెంట్ సుంచుశ్రీనివాస్, ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, అధ్యక్షుడు ఆత్రంగణపతి, సూరపు సాయన్న మాజీసర్పంచ్, గుమ్ము ల శ్రీనివాస్, పోతరాజు శ్రీని వాస్, బొర్ర భీమేష్, భీమేష్,సుంచురామకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలు



మోటార్ సైకిల్‌పై నుంచి కింద పడ్డ దృశ్యం



అంబులెన్స్‌లో ఆస్పత్రికి..

మామడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు ఢీకొని కప్పన్‌పల్లి గ్రామానికి చెందిన నారాయణ(35),సంతోష్(32)లకు తీవ్ర గాయాలు అయినట్లు తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మా మడ నుంచి కప్పన్‌పల్లి స్వగ్రామానికి మోటార్ సైకిల్‌పైవెళ్తున్న ఇద్దరు ఖానాపూర్ నుండి నిర్మల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ ప్రైవేట్ బస్సు అతి వేగంగా ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు 108కి కాల్ చేయడంతో క్షతగాత్రులను చికిత్స కోసం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుటుం బ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మామడ ఎస్సైఅశోక్,ఏఎస్సైషైమద్ తెలిపారు.

అంబులెన్స్ రాక గంట ఆలస్యం

ఆర్టీసీ బస్సు మోటార్ సైకిల్ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు 108కు కాల్ చేయడంతో మామడ అంబులెన్స్ వేరే కేసులో నిర్మల్ వెళ్లగా ఖానాపూర్ నుండి అంబులెన్స్ వచ్చే వరకు గంటకు పైగా జాతీయ రహదారిపై రోడ్డు పైనే గాయాలైన వ్యక్తులు ఉన్న ఆపదల్లో కాపాడే నాథుడే కరువయ్యారు. వందలాది వాహనాలు వెళ్తూ ఉన్న ఏ ఒక్క వాహనం కూడా ఆపి ఆసుపత్రికి తీసుకెళ్లలేకపోయిన సంఘటన అందరినీ బాధించింది.



బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న అధికారులు

ఘనంగా బతుకమ్మ వేడుకలు

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. తీరొక్కపూలతో బతుకమ్మను అలంకరించి, సంప్రదాయబద్ధంగా ఆడుతూ పండుగ సంబరాలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ పద్మభూషణ్, ఎంపీడీవో స్వప్నశీల, కార్యాలయ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.



బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న అధికారులు

ఎన్నికల నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీవో వనజ

కుంటాల, సెప్టెంబరు, 30:(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నియమ నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని, నిబంధనలు పాటించని యెడల చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ కమల్‌సింగ్, ఎంపీడీవో వనజ అన్నారు. మంగళవారం ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన సందర్భంగా ఎలాంటి ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు, బతుకమ్మ వేడుకల్లో ఇతర కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రకటలను చేయకూడదని, ప్రభుత్వ ఆస్తులు, కార్యాలయాలు, విద్యుత్ స్తంభాలపై ఎలాంటి రాజకీయ పార్టీ జెండాలను గోడ రాతలను రాయకూడదన్నారు. గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహించకూడదని, నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రహీం, తదితరులు ఉన్నారు.

ఏకగ్రీవ "పంచాయతీ"

(5వ పేజీ తరువాయి..)

లేకపోతే తమపార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికలకు ముందే ఏకగ్రీవం వైపు పలు గ్రామ పంచాయతీలు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.

జోరుగా విందు రాజకీయాలు

దసరా పండుగకు ముందే స్థానిక ఎన్నికల షెడ్యూల్ ఖరారు కావడంతో గ్రామాల్లో జోరుగా విందు రాజకీయాలకు తెరలేపుతున్నారు. ముఖ్యంగా దసరా పండుగ రోజు విందు పార్టీలను ఏర్పాటు చేసేందుకు ఆశావాహ నేతలు ఆసక్తి చూపుతున్నారు. ఓటర్ల నుంచి ఆశావాహ నేతలకు మరింత తాకిడి పెరిగే అవకాశం కనిపిస్తుంది. గ్రామానికి దూరంగా ఫాంహౌజ్, పంట చేన్లు, అటవి ప్రాంతాల్లో గ్రామస్థాయిలోని ముఖ్య నేతలకు విందులను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. అయితే రిజర్వేషన్ల పై కొందరు కోర్టును ఆశ్రయించడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అక్టోబర్ 8 తర్వాత స్థానిక ఎన్నికల పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందంటున్నారు. తొందర పడి విందులు, మద్యం పంపిణీ చేస్తే పరిస్థితి ఏమిటన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే దసరా పండుగ తర్వాత పల్లె రాజకీయం మరింత ఊపందుకునే అవకాశం ఉందంటున్నారు. ముఖ్యంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే ఆశావాహ నేతలు దసరా దావత్‌లపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు.

ఇయర్ రింగ్ మిషన్ పంపిణీ



సోనాలలో బాధితునికి హియరింగ్ మిషన్ అందిస్తున్న రాష్ట్ర విచార విభాగ్ కోఆర్డినేటర్

బోథ్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రం చెందిన కొండ రామకృష్ణ కుమారుడైన కొండ సిద్ధు గత కొన్ని సంవత్సరాలుగా హియరింగ్ బాధతో ఉన్నాడు. అయితే విషయం తెలుసుకున్న ఏఐసీసీ విచారణ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు విషయాన్ని విన్నవించారు. దీంతో విద్యార్థికి అవసరమైన నాలుగు లక్షల ఇరవై వేల రూపాయల విలువగల హియరింగ్ మిషన్‌ను సరఫరా చేశారు. దీంతో తుల అరుణ్ చేతుల మీదుగా మంగళవారం విద్యార్థికి అందజేయడం జరిగింది.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాజుల పోతన్న, కసిరే పోతన్న, బత్తుల రమేష్, చెట్లపల్లి అనిల్, మాజీ సర్పంచులు నరోత్తం రెడ్డి, సోయం బాపూరావు, విజయభాస్కర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ ఎల్ పోశెట్టి, గంగారెడ్డి, ఆశ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గోక గణేష్‌రెడ్డి

తలమడుగు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అధికార కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మంగళవారం తలమడుగు మండలంలోని సుంకిడి, ఝరి, బరంపూర్ ఎంపీటీసీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక కోసం ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు వధువుల కోసం టిఆర్ఎస్ బిజెపి పార్టీల నాయకులు వస్తారని వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు.ఈ కార్యక్రమంలో బరంపూర్ ఎంపీటీసీ అభ్యర్థిగా కనక వసంత్, జరీ, ఎంపీటీసీ అభ్యర్థిగా బూరుగు సవిత రాజులను నిర్ణయించడం జరిగింది. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి., బాబన్న, మాజీ ఎంపీపీరాము, మాజీ ఎంపీటీసీ పెందురు మాధవ్, మాజీ ఎంపిటిసి వెంకన్నయాదవ్ ఆధ్వర్యంలో నిర్ణయించడంజరిగింది. కసులాల ప్రతాప్, మోహన్‌రెడ్డి, జైతు పటేల్, జ్ఞానేశ్వర్, శ్రీను యాదవ్, పొచ్చన్న, నడిపేన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీమా డబ్బులు అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న దృశ్యం

ముథోల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం బాధిత రైతు కుటుంబ సభ్యులకు బీమా డబ్బులను అందజేశారు. బాసర మండలంలోని కిర్గుల్(బి) గ్రామానికి చెందిన కరెండే ప్రతిభ, ముథోల్ మండలంలోని ఆష్టా గ్రామానికి చెందిన కనకాపూర్ రుక్మవ్వలు పీఏసీఎస్ బ్యాంక్‌లో పంట రుణాలను తీసుకున్నారు. అయితే వారు ఇటీవల చనిపోయారు. వారికి రుణం పొందేటప్పుడు రూ. 803లతో ఎల్ఐసీ బీమా చేశారు. అయితే వారు ఇటీవల సాధారణ మరణం పొందారు. ఒక్కొక్కరికి మంజూరైన రూ. 2 లక్షల చెక్కులను మంగళవారం బాధిత రైతు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో సాయరెడ్డి, ఏసీవో నాగేశ్వర్ రావు, బ్యాంక్ మేనేజర్ రిచారాణి, సూపర్‌వైజర్ సాయి కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బోథ్‌లోని దుర్గామాత ఆలయంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్



విట్టాపూర్ కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



దుర్గామాత ఆలయానికి తరలివచ్చిన భక్తులు

దుర్గామాతల వద్ద ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

బోథ్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలోని దుర్గామాత ఆలయం వద్ద మారుమూల గ్రామమైన బీర్లగొంది గ్రామంలోని దుర్గామాతలయాన్ని మంగళవారం స్థానిక శాసనసభ్యులు జాదవ్ అనిల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాలలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరాత్రులు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. నవరాత్రులు ఎంతో పవిత్రమైనవని తాను సైతం నవరాత్రులలో ఆధ్యాత్మిక కార్యక్రమాలలో గడపడం జరుగుతుందన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని దుర్గా దేవి కోరడం జరిగిందన్నారు.

కుంటాల: కుంటాలమండలంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవా లు ఘనంగా కొనసాగుతున్నాయి. గత 9 రోజుల నుండి ఆయా గ్రామాలలో ప్రతిష్ఠించిన దురా మండపాల వద్ద ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకులు రాత్రి వేళల్లో భజన కోలాటం, తదితర కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజ లు నిర్వహిస్తూ అమ్మవారికి ప్రీతి పాత్రమైన నైవేద్యాలు సమర్పిస్తున్నారు. అంతేగాకుండా అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పలు దుర్గామాత మండపాల వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మునిపెల్లి గ్రామంలో హోమం నిర్వహించి అన్నదానం చేశారు. ఈ అన్నదానానికి మాజీ డిప్యూటీ స్పీకర్ అయిండ్ల భీమ్ రెడ్డి కుటుంబం ప్రతి సంవత్సరం విరాళం ఇస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. ఈ కార్యక్రమంలో ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు అయిండ్ల స్వర్ణారెడ్డి, మాజీ సర్పంచ్ కమల్‌కోట పద్మ వెంకట్ రెడ్డి, గ్రామానికి చెందిన పలువురు నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమార్చన

కుంటాల: కుంటాల మండలంలోని విట్టాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద దుర్గమ్మకు మంగళవారం కుంకుమార్చన ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో మంగళహారతులతో దురా ్గమాత మండపానికి చేరుకొని కుంకుమార్చనలో పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోశ్ఛరణాల మధ్య నిర్వహించిన ఇట్టి కార్యక్రమంలో మహిళలు తమ గ్రామ ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో విరాజిల్లాలని కుంకుమార్చన నిర్వహించారు.



మునిపెల్లిలో యాగం నిర్వహిస్తున్న దృశ్యం

వెదురు ఉత్పత్తుల కేంద్రం ప్రారంభం

నార్నూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నేటి పోటీ ప్రపంచంలో స్వయం ఉపాధి మహిళను ఆర్థికంగా బలపరుస్తుందని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి గజానంద్ నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో వెదురు ఉత్పత్తులు తయారు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సహకారంతో మహిళలకు ఉపాధి కల్పించిన జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎవరిపై ఆధారపడకుండా సొంతంగా ఉపాధి పొందే అవకాశాలు ఎన్నో ఉన్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పుండలిక్ చలుర్కార్, కేశవ్ రావు లోకండే, తదితరులు పాల్గొన్నారు.

పత్తి ఎర్రబారుతోంది.. కాయ కుళ్లుతోంది

కుబీర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నేల తడి ఆరడం లేదు. దీంతో పత్తి ఆకులు ఎర్రబారుతూ పూత, కాత రాలిపోతోంది. కాయలు కుళ్లిపోయి నల్లగా మారుతున్నాయి. ఏటా ఎకరానికి దాదాపు పది క్వింటాళ్ల పైబడి దిగుబడి వచ్చేది. కాని ఈ సారి క్వింటా కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 50,100 ఎకరాల సాగు భూమి ఉంది. ఇందులో 22 వేల ఎకరాల్లో పత్తిపంట సాగు చేస్తున్నారు. ముఖ్యంగా మండల కేంద్రమైన కుబీర్‌తో పాటు, పల్సి, పార్డి(బి) మాలేగాం, నిగ్వా, పార్డి(కే), సోనారి, రంజిని, జాంగామ్, గోడాపూర్ గ్రామాల్లో రైతులు అధికంగా పంట పండిస్తున్నారు. వానలు లేకపోతే ఈ పాటికి కాయలు పగిలి బయటికి వచ్చే పత్తిని తీయాల్సి ఉండేది కాని, ఎండ లేక కాయలు పగలడం లేదు. ఎక్కడయినా పగిలినవి ఉంటే వర్షానికి కుళ్లిపోయి నేల రాలిపోతున్నాయి. ముఖ్యంగా పోషకాలు లభించక పోవడం కారణంగా ఆకులు పసుపు, ఎరుపు రంగుల్లోకి మారి వాడిపోతున్నాయి.

● కుబీర్ మండలకేంద్రానికి చెందిన కందూర్ సాయినాథ్ 5 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. పంట ఏపుగా పెరగడంతో మంచి దిగుబడి వస్తుందని భావించాడు. కానీ ప్రస్తుతం ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు, ముసురుకు పంట మొత్తం పాడయిపోయింది. ఏపుగా కాసిన పత్తి కాయలు నల్లగా మారి నేలరాలుతున్నాయి. ఇప్పటి వరకు ఎకరానికి రూ.30వేల పెట్టుబడి పెట్టినా క్వింటాలు (దూది) పత్తి కూడా రావడం కష్టంగా మారిందని వాపోతున్నారు.


పంటక్షేత్రంలో నేల రాలిన పత్తి

ఆదివాసీ పర్ధాన్‌లకు టికెట్లు ఇవ్వాలి

మావల సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆదివాసీ పర్ధాన్ తెగకు అన్ని రాజకీయ పార్టీలు గుర్తింపునిచ్చి బీ-ఫారాలను అందజేయాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నేతలు కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్ రిజర్వేషన్‌లు ఖరారుచేయగా, ఎన్నికల్లో ఆదివాసీ పర్ధాన్ సమాజ్‌కు చెందిన అభ్యర్థులకు ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. జిల్లాలోని ప్రతి మండలంలో ఆదివాసీ పర్ధాన్ సమాజ్ ఓటు బ్యాంకు కలిగి ఉన్నారన్నారు. అంతేకాకుండా తమ తెగకు గిరిజనులతో పాటు గిరిజనేతరుల మద్దతు సైతం సంపూర్ణంగా ఉందన్నారు. ఎస్టీ రిజర్వ్ అయిన చోట అన్నీ పార్టీలు తమకు న్యాయం చేస్తారని తమకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. కార్యక్రమంలో పర్ధాన్ సమాజ్ నాయకులు కుర్సేంగే యాదవ్ రావ్, పూసం ఆనంద్ రావ్, మెస్రం శంకర్, వెట్టి దేవిదాస్, కినక సురేష్, సేడ్మకి సుభాష్, మడావి దిగంబర్, గేడం జనార్ధన్, మెస్రం విలాస్, గేడం అశోక్, గేడం దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న పర్ధాన్ సమాజ్ నేతలు

భూ అక్రమాలకు పాల్పడితే చర్యలు : డీఎస్పీ

మావల సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫోర్జరీలు, భూ అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడిన వారిపై, ప్రభుత్వ ప్రైవేట్ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నం చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా మావల పోలీస్ స్టేషన్ పరిధిలో దళితుల భూస్వాధీన ప్రయత్నం, ప్రాణహానీ, బెదిరింపుల కేసులో నిందితుడు ఉష్కం రఘుపతిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఫిర్యాదుదారు ఎరేనదిపి గంగన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపినట్లు తెలిపారు. బాధితుడు అసైన్డ్ పట్టా భూములను ఆరు సంవత్సరాల క్రితం రఘుపతికి తాకట్టు పెట్టి ఒక్కొక్కరు రూ.18 లక్షలు పొందారని, భూములను తిరిగి సాగు చేసుకోవడానికి, అప్పు తీర్చడానికి వచ్చినప్పుడు నిందితుడు కొంత మందితో కలిసి అక్కడికి చేరుకొని బెదిరింపులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. భూములను అక్రమంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేయడంతో నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. బాధితులకు న్యాయం చేయడం, చట్టం, శాంతి భద్రతను కాపాడడం కోసం పోలీసులు కట్టుబడి ఉన్నారని స్పష్టం చేశారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

● 23న తొలి విడత పంచాయతీ ఎలక్షన్స్ ● సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్

ఉట్నూర్, సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఎన్నికల నియమావళి పాటిస్తూ సహకరించాలని సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. అక్టోబర్ 9న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. ఉట్నూర్ డివిజన్‌లోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ మండలాలతో పాటు ఆదిలాబాద్ డివిజన్‌లోని సిరికొండ, ఇచ్చోడ మండలంలో ఉన్న గ్రామ పంచాయతీల ఎన్నికల పోలింగ్ 23న నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇంద్రవెల్లి మండలంలో 28 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, 236 వార్డుల ఎన్నికలకు 236 పోలింగ్ స్టేషన్‌లు, ఉట్నూర్ మండలంలో 38 పంచాయతీల సర్పంచ్‌లకు, 336 వార్డు సభ్యుల ఎన్నికలకు కోసం 353 పోలింగ్ స్టేషన్లు, నార్నూర్ మండలంలో 23 గ్రామ సర్పంచ్‌లు, 198వార్డు సభ్యుల ఎన్నికల కోసం 198 పోలింగ్ స్టేషన్లు, గాదిగూడ మండలంలో 25 గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, 196 వార్డు సభ్యుల ఎన్నికలకు 196 పోలింగ్ స్టేషన్‌లు, సిరికొండ మండలంలో 19 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, 148 వార్డు సభ్యుల ఎన్నికలకు 148 పోలింగ్ స్టేషన్లు, ఇచ్చోడ మండలంలో 33 గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, 276 వార్డు సభ్యుల ఎన్నికలకు 276 పోలింగ్ స్టేషన్లు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. సర్పంచ్ అభ్యర్థులు రూ.2.50లక్షల వరకు, వార్డు సభ్యుల అభ్యర్థులు రూ.30వేల నుంచి రూ.50వేల వరకు మాత్రమే ఎన్నికల ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ర్యాలీలు, సమావేశాలు, సభలు నిర్వహించడానికి ముందస్తు అనుమతులు పొందాలన్నారు. ఎన్నికల ప్రచారంలో కులాలు, మతాలు, వర్గాలు పేర్లుతీసుకోకుండా ఎవరిని అవమాన పరచకుండా ఎన్నికల ప్రచారం శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో తహసీల్దార్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు


సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

అమ్మవారిని దర్శించుకున్న బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నేరడిగొండ మండలంలోని వైడూర్యపురం గ్రామంలోని పెద్ద హనుమాన్, చిన్న హనుమాన్ దుర్గామాత మండపాలను మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండప నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిమజ్జనోత్సవాలను ప్రజలంతా శాంతియుతంగా పండుగ సంబరాలను జరుపుకోవాలని కోరారు. ఆయన వెంట మండల నాయకులు, కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

రోడ్ల నిర్మాణానికి రూ.7.98 కోట్లు మంజూరు

భైంసా, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల వ్యవసాయ క్షేత్రాలకు రోడ్లు నిర్మించేందుకు గాను రూ.7.98 కోట్లు మంజూరైనట్లు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ తెలిపారు. మంగళవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని 131 ప్రాంతాల్లో వ్యవసాయ క్షేత్రాలకు రోడ్ల నిర్మాణానికి రూ.7.98 కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. మంజూరైన నిధులలో బాసర మండలానికి రూ.61 లక్షలు, భైంసా మండలానికి రూ.90 లక్షలు, కుభీర్ మండలానికి రూ.1.71 కోట్లు, కుంటాల మండలానికి రూ.90.50 లక్షలు, లోకేశ్వరం మండలానికి రూ.90.10 లక్షలు, ముథోల్ మండలానికి రూ.90 లక్షలు, నర్సాపూర్ (జి) మండలానికి రూ.63 లక్షలు, తానూర్ మండలానికి రూ.1.42 కోట్లు కేటాయించినట్లు వివరించారు. సంబంధిత పనులన్నీ పంచాయత్ రాజ్ శాఖ ఆధ్వర్యంలో డీఆర్‌డీవో, డీపీవో శాఖల సమన్వయంతో వచ్చే మార్చి 31వ తేదీ వరకు పూర్తవుతాయని తెలిపారు. సమావేశంలో బీజేపీ ప్రతినిధులు సాంప్లీ రమేష్, బోస్లే పండిత్‌రావ్ పాటిల్, గోప సాయినాథ్, సోలంకే భీంరావ్ పాటిల్ , చాకేటి అశోక్, కాంబ్లే సుభాష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

● బాసర నుంచి మహోర్ వరకు జాతీయ రహదారి నిర్మాణానికి సర్వే

నియోజక వర్గపరిధిలోని బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి క్షేత్రం నుంచి మహోర్ వరకు జాతీయ నిర్మాణానికై కేంద్రం ప్రభుత్వం సర్వే చేపడుతోందని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ వెల్లడించారు. గత మే నెలలో న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి సంబంధిత రోడ్డు నిర్మాణ విషయమై వినతిపత్రం అందజేసినట్లు వివరించారు. రోడ్డు నిర్మాణ అవశ్యకతను, ప్రయోజనాలను వివరించినట్లు తెలిపారు. స్పందించిన కేంద్ర మంత్రి ఎన్‌హెచ్ ఆథారిటీస్ ద్వారా సంబంధిత రోడ్డు నిర్మాణం కోసం సర్వే చేపట్టాల్సింది ఆదేశించారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని తనకు లేఖ ద్వారా తెలియపరిచారని తెలిపారు.

ఘనంగా టీఎన్‌జీవో అధ్యక్షుడి పదవీ విరమణ

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా టీఎన్జీఓ అధ్యక్షులు సంద అశోక్ పదవి విరమణ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని టీఎన్జీఓ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం సభ్యులతో పాటు వివిధ శాఖల ఉద్యోగులు ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి ఎ.నవీన్ కుమార్ మాట్లాడుతూ.. 38 ఏళ్ల ఉద్యోగ కాలంలో వివిధ హోదాలలో పనిచేస్తూ ఎంప్లాయిమెంట్, ట్రైనింగ్ శాఖలో సూపరిండెంట్‌గా పదవి విరమణ పొందారని పేర్కొన్నారు. నాలుగుసార్లు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడిగా, జిల్లా జేఏసీ ఛైర్మన్‌గా సేవలందించారని తెలిపారు. ఎల్లప్పుడూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ముందుండేవారని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ యూనియన్ రాష్ట్ర బాధ్యులు తిరుమల రెడ్డి, జిల్లా బాధ్యులు జి.గోపి, రాజేశ్వర్, సుజాత, ఓం ప్రసాద్, రాంకుమార్, నూర్ సింగ్, నారాయణ, ఆదిలాబాద్ అర్బన్ అధ్యక్షులు ఎ.మహేందర్, కార్యదర్శి కె.అరుణ్ పాల్గొన్నారు.


టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు సంద అశోక్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు, సంఘం ప్రతినిధులు

బాసరలో కిలేడీ హల్‌చల్

బాసర, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మళ్లీ చోరీలు సంచలనం రేపుతున్నాయి. సోమవారం అర్ధరాత్రి ఓ యువతి మరో వ్యక్తితో కలిసి వెంకటేశ్వర కాలనీలో రెండు ఇళ్లలో దోపిడీకి పాల్పడింది. తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసిన ఈ దొంగలు తాళాలు పగుల కొట్టి సొత్తును దోచుకెళ్లారు. గ్రామానికి చెందిన లింగంపల్లి సంగీత, పవర్ దత్తు ఇళ్లను తాళం వేసి యజమానులు ఊరికి వెళ్లగా, తిరిగి వచ్చి చూసేసరికి చోరీ జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరా ఫుటేజ్ పరిశీలనలో ఓ యువతి, మరో వ్యక్తి కలిసి ఈ దోపిడికి పాల్పడ్డట్లు గుర్తించారు. ముఖాలకు మాస్కులు ధరించి, చాకచక్యంగా తాళాలు పగలగొట్టినట్లు వీడియోలో కనిపించింది. అంతేకాక, సాయంత్రం ఓ వ్యక్తి దీక్ష దుస్తులు ధరించి అనుమానస్పదంగా తిరిగిన రికార్డు కూడా పోలీసుల దృష్టికి వచ్చింది. ఇదే కాలనీలో పదిరోజుల క్రితం పలు ఇళ్లలో దొంగలు బంగారం, నగదు అపహరించిన విషయం తెలిసిందే. అతి తక్కువ వ్యవధిలో మళ్లీ చోరీ జరగడంతో స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నిత్య భయాందోళనలో ఉంటున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుగోతుందని నిందితులను త్వరలో పట్టుకుంటామని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.


సీసీ కెమెరాలో రికార్డయిన అనుమానస్పద వ్యక్తులు

వైభవంగా అమ్మవారి ప్రతిమల నిమజ్జనోత్సవం

ఉట్నూర్, తలమడుగు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల వ్యాప్తంగా మంగళవారం బతుకమ్మ వేడుకలు, అమ్మవారి నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వినాయక చౌక్‌లో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బతుకమ్మలను, అమ్మవారి ప్రతిమలను ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహిస్తూ లక్కారం చెరువుకు చేరుకొని నిమజ్జనం నిర్వహించారు. పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు నిర్వహించారు.

● తలమడుగు మండలంలోని దేవాపూర్‌లో శ్రీ నవశక్తి దుర్గ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత మండపం వద్ద కుంకుమర్చన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. పంతులు శిలంకోటి శివాజీ మాట్లాడుతూ.. ఆది పరాశక్తి దుర్గామాతను దసరా నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కుంకుమార్చనలో అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


ఉట్నూర్‌లో శోభ యాత్రలో దుర్గాదేవి విగ్రహం


ఉట్నూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రాత్రివేళ ఇళ్లలో చోరీ

నేరడిగొండ , సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగిన దొంగతనం స్థానికంగా కలకలం రేపింది. ఎస్ఐ ఇమ్రాన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రంలోని మధురానగర్ కాలనీకి చెందిన మొహమ్మద్ సోఫీ స్థానికంగా హోటల్ వ్యాపారి. సోమవారం తన కుటుంబ సభ్యులతో కలిసి మహారాష్ట్రలోని కిన్వట్ గ్రామంలో ఉన్న తన అత్తగారింటికి వెళ్లాడు. కాగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో చూసిన గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చొరబడ్డారు. బీరువా పగులగొట్టి రూ.30 వేలు దోచుకెళ్లారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. ఎక్కడికైనా వెళ్లినప్పుడు ఇంటిపై తెలిసిన వారి నిఘా ఉండేలా చూసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ముథోల్ మాజీ ఎమ్మెల్యే

రోడ్ల నిర్మాణానికి చర్యలు

భైంసా, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలలో రైతుల సౌకర్యార్థం పంటచేలకు రోడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు గాను చర్యలు చేపట్టామని ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పటేల్ వెల్లడించారు. మంగళవారం భైంసాలోని క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతన్నలు సాగు పనుల నిర్వాహణ కోసం పంటచేలకు రాకపోకలు చేపట్టేందుకు సరైన రోడ్డు మార్గాలు లేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి సాగు చేసిన పంటల దిగుబడులను తరలించే విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సంబంధిత సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో నియోజక వర్గ పరిధిలో వివిధ ప్రాంతాల్లోని 25 గ్రామాల్లోని పంటచేలకు రూ.2.5 కోట్లతో రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నామని తెలిపారు. ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా సంబంధిత రోడ్లను పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్నారని వివరించారు. వచ్చే మార్చి ముగింపు సమయానికి సంబంధిత రోడ్ల నిర్మాణపు పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నియోజక వర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 12 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో భైంసా ఆత్మ కమిటీ ఛైర్మెన్ సిద్ధంవార్ వివేక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బెజ్జంకి ముత్యంరెడ్డి, మాజీ ఎంపీపీ సయ్యాజీ భోజరాం పాటిల్, యువజన కాంగ్రెస్ ప్రతినిధి పురంశెట్టి రవికుమార్. భైంసా మండల పార్టీ ప్రతినిధి ప్రకాష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

సమ్మె విరమించిన ఉద్యోగులు

ఉట్నూర్, సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట గత 19 రోజులుగా సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేస్తున్న దినసరి ఉద్యోగులు ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా హామీతో మంగళవారం సమ్మె విరమించారు. ఐటీడీఏ పరిపాలనాధికారి దామోదరస్వామిని పంపించి వారికి నిమ్మరసం అందించి సమ్మె విరమింపచేయించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చెప్పిన సమాచారం మేరకు దినసరి ఉద్యోగులతో పరిపాలన అధికారి మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌తో ప్రాజెక్టు అధికారి సమ్మె విషయమై చర్చించారు. వేతనాల బడ్జెట్ పూర్తిగా విడుదల అయినప్పటికీ ఐఎఫ్ఆర్ఎస్ పూర్తి చేసి దీపావళి లోగా పెండింగ్ వేతనాలు పూర్తిగా చెల్లిస్తామని పీవో తెలిపినట్లు వివరించి నిమ్మరసం అందించారు. దీపావళి నాటికి అయిన తమకు పూర్తి పెండింగ్ వేతనాలు అందించాలనికోరుతూ గిరిజన సంక్షేమ దినసరి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సమ్మె విరమించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శంకర్‌నాయక్‌తో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు ఏరుకొండ రాజన్న, రాథోడ్‌బాపురావు, మనిరామ్, బాపు తదితరులు పాల్గొన్నారు.


సమ్మె విరమణ చేయిస్తున్న పరిపాలన అధికారి దామోదరస్వామి

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
నిర్మల్ జిల్లా వార్తలు
8
బుధవారం 1 అక్టోబరు 2025



తొమ్మిదో రోజు సిద్ధిదాత్రి
అలంకరణలో అమ్మవారి దర్శనం

బాసర, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతి అమ్మవారి క్షేత్రంలో కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు మంగళవారం బాసర సరస్వతి అమ్మవారు సిద్ధి దాత్రి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి పరమాన్నం, పిండి వంటలను నైవేద్యంగా సమర్పించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా బోనాల పండుగ

లోకేశ్వరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మహాలక్ష్మి అమ్మవారికి, పెద్దమ్మ తల్లికి బోనాల పండుగను గ్రామస్థులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వివిధ కుల సంఘాల మహిళలు బోనాలను డప్పు వాయిద్యాల మధ్య శివసత్తులతో ఊరేగించారు. అమ్మవారికి బోనాలు, నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, గ్రామస్థులు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ ప్రతి ఏడాది పండుగ నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సౌజన్య కపిల్, ఎంపీటీసీ జయసాగర్ రావు, వీడీసీ అధ్యక్షులు గంగాధర్, క్యాషియర్ నగేష్, వీడీసీ సభ్యుడు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

పంటల పరిశీలన

దస్తురాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు సాగు చేస్తున్న యూరియా, నానో యూరియా పంటలను జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ సమయానికి తగినంత మోతాదులోనే ఎరువులను వినియోగించాలని, అధిక మోతాదులో వాడకూడదని సూచించారు. నానో యూరియా వాడకం ద్వారా తక్కువ వ్యయంతో మంచి దిగుబడులు సాధ్యమవుతాయని వివరించారు. రైతులు సేంద్రియ ఎరువులు, నానోఎరువుల వినియోగంపై ఆసక్తి చూపాలని, పంటల ఆరోగ్యకరమైన పెరుగుదల కోసం శాస్త్రీయ పద్ధతులను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఏవో జగదీష్, దస్తురాబాద్, సత్తెనపల్లి ఏఈవోలు తిరుపతి, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

దస్తురాబాద్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

దస్తురాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ముడికే ఐలయ్య మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. గులాబీ జెండా మరోసారి ఎగురవేయడానికి ప్రతి గ్రామంలో శక్తివంతమైన బృందంగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులున్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

దస్తురాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కొత్తగూడెంలో శివనాట్య యూత్ ఆధ్వర్యంలో మంగళవారం చండీ హోమం నిర్వహించారు. హోమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని శ్రీ సిద్ధి ధాత్రి దుర్గా సేవ సమితి ఆధ్వర్యంలో కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

2న సాయిబాబా 107 పుణ్యతిథి



సాయిబాబా విగ్రహం

నిర్మల్ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గండి రామన్న దత్తసాయి మందిరంలో అక్టోబరు 3న శ్రీషిర్డీ సాయిబాబా 107వ పుణ్యతిథి కార్యక్రమం అంగరంగ వైభవంగా జరుపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయిబాబా అనుగ్రహంతో భక్తులు ప్రతి సంవత్సరం విశేషమైన భక్తి శ్రద్ధలతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ సంవత్సరం కూడా శ్రీషిర్డీ సాయిబాబా వారి 107వ పుణ్యతిథి (మహా సమాధి దినోత్సవం)సందర్భంగా వేడుకలు ఏర్పాటు చేయబడతాయన్నారు. ఈ పవిత్ర దినాన 1918 అక్టోబరు 15న బాబా తన భౌతిక దేహాన్ని విడిచి పెట్టి సమాధి స్థితిని పొందారని అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా సాయి భక్తులు ఈ పుణ్య తిథిని గౌరవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈసందర్భంగా మాకాలనీ భక్తులు శ్రీసాయిబాబా పుణ్య తిథి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలు 02.10.2025 బుధవారం మాకాలనీలోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో జరుగనున్నాయని తెలిపారు. అందరూ భక్తులు విచ్చేసి శ్రీసా యి బాబా వారి ఆశీర్వాదాలు పొందవలసిందిగా కోరారు. ఉదయం 5:50కి కాడహారతి, మధ్యాహ్న హారతి, సాయంత్రం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు, ధూప హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి గీతాలాపనలు నిర్వహించబడతాయని తెలిపారు. భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని శ్రీసాయిబాబా ఆశీర్వాదాలు పొందవలసిందిగా, కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా పేర్కొన్నారు.



'వరి'దొడుకులు

- తెగుళ్లతో రైతులపై అదనపు భారం
- 4.37లక్షల ఎకరాల్లో వరి సాగు
- తెగుళ్లతో అదనంగా ఖర్చు
- సన్న రకానికి అధికంగా ఎండాకు తెగులు
- ఆదుకోవాలంటున్న అన్నదాతలు

ప్రతికూల వాతావరణ వనాకాలం వరిపైరుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. భారీ వర్షాలతో ఈసారి వరిపైరుపై తెగుళ్లు విజృంభిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో వరిపైరుపై బ్యాక్టీరియా తీవ్ర ప్రభావం చూపుతోంది. బ్యాక్టీరియా తెగులు బారిన పడి వరిపైరుకు తీవ్ర నష్టం జరిగింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వదలని వర్షాలతోనే వరిపైరు కంకి పాలుపోసుకొనే దశలో ఆకు ఎండుతెగులు సోకింది. ఆకులు ఎండిపోయి కంకులు పాలుపోసుకోలేకపోవడంతో వరికంకులు(గింజలు) తాలుగా మారనున్నాయి. ఈ తెగులు నివారణకు ఎన్నిరకాల మందులు పిచికారీ చేసినా అదుపులోకి రాలేదని రైతులు వాపోతున్నారు. ఈ తెగులు బారిన పడినపోలాల్లో 10 నుంచి 15 బస్తాల దిగుబడి కూడా రావడం కూడా కష్టమేనని అన్నదాతలు అంటున్నారు.

నిర్మల్, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): వరి పంటపై ఎండాకు తెగులు ప్రభావం జిల్లాలో అధికంగా ఉంది. ఎన్ని రకాల మందులు పిచికారీ చేసిన పురుగు ఉధృతి మాత్రం తగ్గడం లేదు. ఈ తెగుళ్ల కారణంగా పంటకు దిగుబడిపై ప్రభావం చూపుతుంది. ఆరుగాలం కష్టపడి పంటలను సాగు చేస్తున్న రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. తెగుళ్ల కారణంగా దిగుబడి సగానికి సగం తగ్గే అవకాశాలు ఉన్నాయని రైతులు వాపోతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ వర్షాకాలం సాగు చేస్తున్న వరి పంటకు ముఖ్యంగా సన్నరకం వరి పంటకు ఎండకు తెగులు సోకి పురుగు ఉధృతి తగ్గకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుకు వరి పంట సాగు చేయడానికి మొలక వేసిన నుంచి పంట చేతికి వచ్చేంత వరకు రైతుకు పెట్టుబడి సుమారు రూ.25వేల



నుంచి రూ.30వేల వరకు ఖర్చు అవుతుంది. దానికి తోడు అదనంగా ఈ తెగుళ్ల కారణంగా రైతుపై మరో రూ.10వేల భారం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడులు అధికంగా పెరిగిపోవడంతో పంట సాగు చేస్తున్న రైతుకు గిట్టుబాటు కావడం లేదని వాపోతున్నారు.

తెగుళ్ల కారణంగా దిగుబడిపై ప్రభావం

జిల్లాలో సాగు వరి, మక్క, సోయా, పత్తి, పెసర్లు, కందులు పంటలను రైతులు సాగుచేస్తారు అత్యధికంగా జిల్లావ్యాప్తంగా వరి పంట లక్షా 30వేల ఎకరాల్లో పంటను రైతులు సాగు చేస్తున్నారు. ముఖ్యంగా సన్నా రకం వరికి ఎండకు తెగుళ్ల సోకి దిగుబడి అంతంత మాత్రమే వచ్చే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. వరి పంటకు తెగుళ్ల సోకకుండా ఉంటే 28 క్వింటాల నుంచి 32 క్వింటాళ్ల వరకు రైతుకు పంట దిగుబడి వచ్చేదని, ప్రస్తుతం ఎండాకు తెగుళ్ల కారణంగా వరి పంట 18 క్వింటాళ్ల నుంచి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తమకు ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

తెగులుతో అదనపు భారం



● గడ్డం రాజారెడ్డి, రైతు

10 ఎకరాలలో సన్నరకం వరి సాగుచేస్తున్నా. గత ఏడాది తెగుళ్ల లేకుండే. ఎకరాకు 30క్వింటళ్ల వరకు గత వర్షకాలం దిగుబడి వచ్చింది. ప్రస్తుతం 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేటట్లు ఉంది. 3 నుంచి 4సార్లు పురుగు మందులను పిచికారీ చేయాల్సి వస్తోంది. అయినా కూడా పురుగు ఉధృతి ఆగడం లేదు.

ప్రభుత్వం వరి రైతులను ఆదుకోవాలి



● చిన్నయ్య, రైతు

వరి సాగు పెట్టుబడి పెరగడంతో రైతుల నెత్తిమీద అప్పుల భారం తడిసి మోపిడౌతుంది. దీంతో లాభాలు రావడం కష్టమే. పెట్టుబడి కూడా వస్తాయో రావు అన్న పరిస్థితి ఉంది. గత వానకాలంతో పోలిస్తే ఇప్పుడు ఎకరాకు 10వేల వరకు అదనపు భారం పడుతుంది. ప్రభుత్వం వరి రైతులను ఆదుకోవాలి.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి

» కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీ ఎన్నికల నియమావళి అమలు, ఎన్నికల నిర్వహణకు అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ప్రతీ అధికారి ఎన్నికల కోడ్‌ను పాటించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎటువంటి రాజకీయ ఫ్లెక్సీలు, వాల్‌పెయింటింగ్స్ ఉండొద్దని చెప్పారు. రాజకీయ పార్టీల కార్యక్రమాలకు అనుమతి తప్పనిసరని స్పష్టంచేశారు. అభ్యర్థుల ఎన్నికల వ్యయానికి సంబంధించిన వివరాలను అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అంతర్‌రాష్ట్ర సరిహద్దులవద్ద ఇప్పటికే చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, అధికారులు ఎప్పటికప్పుడు చెక్‌పోస్టులను తనిఖీ చేస్తూ ఉండాలని చెప్పారు. ఎన్నికలప్రక్రియ సజావుగా జరిగేందుకు ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వివరించారు. అన్ని పోలింగ్‌కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా మౌలిక వసతులు కల్పించాలని చెప్పారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు విస్తృత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, సీపీవో జీవరత్నం, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సీజ్ చేసిన వాహనాలు

నేరాల నియంత్రణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్

దస్తురాబాద్, సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహిస్తున్నట్లు ఖానాపూర్ సీఐ అజయ్ అన్నారు. మండలంలోని భూత్కూర్‌లోని రాంపూర్ గ్రామంలో మంగళవారం కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 82 ద్విచక్ర వాహనాలు, ఐదు ఆటోలు, రెండుట్రాక్టర్లకు జరిమానా వేసినట్లు తెలిపారు. అనంతరం సీఐ అజయ్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సైలు సాయి కుమార్, సాయి కిరణ్, హన్మండ్లు, జ్యోతి మణి, సిబ్బంది పాల్గొన్నారు.



లైబ్రరీలో చదువుకుంటున్న పాఠకులు

కావేరి గ్రంథాలయానికి ఉద్యోగోత్సాహం

» ముగ్గురు పాఠకులకు గ్రూప్- 2 కొలువులు

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని డా. అప్పాల కావేరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డా.కావేరి గ్రంథాలయంలో చదివిన ముగ్గురు అభ్యర్థులు గ్రూప్-2 కొలువులు సాధించారు. చేపూరి రాజు సబ్‌రిజిస్టర్‌గా, మారాజు రాజ్‌కుమార్ ఎంపీవోగా, కళ్లెం రమేష్ అసిస్టెంట్‌రిజిస్టర్‌గా ఉద్యోగాలు సాధించారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఫౌండేషన్ చైర్మన్ డా.అప్పాల చక్రధారి, కోశాధికారి అప్పాల శశికళ వారికి అభినందనలు తెలిపారు. ఇప్పటివరకు 144 మంది నిరుపేద విద్యార్థులు ఈలైబ్రరీలో ఉచితంగా చదువుకొని ప్రభుత్వ కొలువులు సాధించడం పట్ల వారు హర్షాభావం వ్యక్తపరిచారు. పాఠకులకు తెలంగాణలోనే మొదటి ఈ-లైబ్రరీగా ఆన్‌లైన్ సేవలను ఉచితంగా అందిస్తూ అనేక విధాలుగా పాఠకులకు అవసరమైన స్టడీ మెటీరియల్ ఎప్పటికప్పుడు కోరిన వెంటనే అందించడాన్ని లైబ్రరీ సేవలను కొనియాడుతూ కొలువులు సాధించిన అభ్యర్థులు, పాఠకులు ఫౌండేషన్ చైర్మన్ డా. చక్రధారికి కృతజ్ఞతలు తెలియజేశారు.



మారాజు రాజ్ | చేపూరి రాజు | కళ్లెం రమేష్

వైద్యుల నిర్లక్ష్యానికి బాలుడి మృతి

» ఖానాపూర్‌లో ఓ ప్రైవేట్ ఆసుపత్రి ఎదుట ఆందోళన » ఆసుపత్రి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



ఖానాపూర్‌లో ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న పోలీసులు

ఖానాపూర్,సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యమే తమ 18 నెలల పసివాడి ప్రాణం తీసిందని ఖానాపూర్‌లో బంధువులు ఆగ్రహంవ్యక్తం చేశారు. మంగళవారం ఖానా పూర్‌లోని రాజీవ్‌నగర్ కాలనీకిచెందిన పలు వురు పద్మావతి నగర్‌లో గల ఓప్రైవేట్ ఆసు పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ...18 నెలల చిన్నారి అయాన్స్‌కు నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో ఖానాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఆసుపత్రిలో రెండు రోజులపాటు బా లుడికి చికిత్స అందించిన వైద్యులు పరిస్థితి విషమించిందని తమతో కాదని నిర్మల్ రిఫర్ చేశారని పేర్కొన్నారు. కాగా నిర్మల్‌లో బాలు డిని పరీక్షించిన వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్ చేయగా సోమ వారం రాత్రి హైదరా బాద్‌తరలిస్తుండగా మార మధ్యంలో బాలు డుచనిపోయినట్లు బాధిత కుటుంబ స భ్యు లు తెలిపారు. ఆసుపత్రిలో ఇచ్చిన ఇంజక్షన్ వికటించడం తోనే అయాన్స్ మృతి చెందాడని వారు ఆవే దన వ్యక్తం చేశా రు. అయాన్స్ బంధువులు ఆగ్రహంతో ఆసుపత్రిపైదాడి చేసి రిసెప్షన్ టేబుల్, ఫర్నిచర్ ధ్వంసం చేశా రు. ఘటన స్థలానికి ఖానాపూర్ ఎస్సై రాహు ల్ చేరుకుని బాధితులను సముదాయించారు. పోలీసులు రావ డంతో వివాదం సద్దుమణిగింది. గొడవ జరుగుతున్న సమయంలో నిర్వాహకులు, వైద్యులు అందుబాటులో లేరు. వెంటనే సదరు ఆసుపత్రిపై చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు.

నంది గుండం ఆలయంలో మాజీ మంత్రి అల్లోల ప్రత్యేక పూజలు



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నంది గుండం దుర్గామాత ఆలయంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటాచారి, ఆలయ అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ

» ఉదారతను చాటుకున్న ఓకేఆర్ ఫౌండేషన్



నూతన వస్త్రాలు అందజేసిన ఓకేఆర్ ఫౌండేషన్ బృందం

ఖానాపూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ మున్సిపల్ పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఓకేఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు కృష్ణంరాజు ఉచితంగా నూతన వస్త్రాలను పంపిణీ చేసి ఉదారతను చాటుకున్నారు. స్థానిక పద్మశాలి సంఘ భవనంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో 45 మంది మున్సిపల్ కార్మికులు రూ. 50 వేలు విలువ చేసే వస్త్రాలను అందజేశారు. దసరా పండుగ నేపథ్యంలో కార్మికుల సేవలకు గుర్తింపుగా తనవంతుగా వారికి అండగా నిలిచేందుకు ప్రయత్నం చేసినట్లు కృష్ణంరాజు తెలిపారు. తమ సేవలను గుర్తించి తమకు నూతన వస్త్రాలు అందజేసిన కృష్ణంరాజుకు మున్సిపల్ కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఓకేఆర్ ఫౌండేషన్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ఎంబీబీఎస్‌లో సీటు

లోకేశ్వరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రానికి చెందిన మెండే రవితేజ పట్టుదలతో చదివి ఎంబీబీఎస్‌లో సీటు సాధించాడు. లోకేశ్వరం గ్రామానికి చెందిన మెండే గంగామణి అశోక్‌ల రెండవ కుమారుడు మెండే రవితేజ ఒకటవ తరగతి నుండి 6వ తరగతి వరకు కుంటాల మోడల్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేశాడు. కష్టపడి చదివి హైదరాబాద్‌లో గల సీఎంఆర్ మెడికల్ కాలేజీలో సీటు దక్కించుకున్నాడు. సీటు వచ్చిందన్న విషయం తెలియగానే కుటుంబ సభ్యులు ఆనందంలో మునిగిపోయారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ ప్రజలు, స్నేహితులు అభినందనలు తెలియజేశారు.